సాక్షి
పశ్చిమగోదావరి
బుధవారం । 24 । మే । 2023



ఆక్వా ఉక్కిరిబిక్కిరి

అధిక ఉష్ణోగ్రతలతో ఆక్వా రంగం ఉక్కిరిబిక్కిరవుతోంది. రోహిణి కార్తెలో ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉందన్న హెచ్చరికల నేపథ్యంలో ఆక్వా రైతులు ఆందోళన చెందుతున్నారు. 8లో



మన్యంలో షూటింగ్ సందడి

బుట్టాయగూడెం మండలం గుబ్బల మంగమ్మ తల్లి జల్లేరు జలాశయం పరిసర ప్రాంతంలో అనన్య సినిమా షూటింగ్ నిర్వహిస్తున్నారు. హీరో హీరోయిన్లపై పాట చిత్రీకరిస్తున్నారు. 8లో



రెల్లి క్రికెట్ విజేతగా రామచంద్రపురం

భీమవరం డీఎన్నార్ కళాశాల ఆవరణలోని నిర్వహించిన రాష్ట్ర స్థాయి రెల్లి క్రికెట్ టోర్నమెంట్ విజేతగా రామచంద్రపురం జట్టు నిలిచింది. గుడివాడ జట్టుపై గెలిచింది. 8లో

న్యూస్‌రీల్

ఈవీఎంల కోసం గోడౌన్ పరిశీలన



గోడౌన్లను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

భీమవరం(ప్రకాశం చౌక్): ఎన్నికల సామగ్రిని భద్రపరిచేందుకు అనువైన గోడౌన్ల ఎంపికలో భాగంగా మంగళవారం కలెక్టర్ పి.ప్రశాంతి సీడబ్ల్యూసీ గోడౌన్లను పరిశీలించారు. విద్యుత్ సౌకర్యం, పైకప్పు, షట్టర్ల భద్రత తదితర అంశాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్ రెడ్డి, ఆర్డీఓ దాసి రాజు, తహసీల్దార్ వై.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షాలకు 157 హెక్టార్లలో పంట నష్టం

సాక్షి, భీమవరం: జిల్లాలో ఇటీవల కురిసిన అకాల వర్షాల కారణంగా 8 మండలాల పరిధిలోని 23 గ్రామాల్లో 157 హెక్టార్లల్లోని వరి పంట 33 శాతం కంటే ఎక్కువగా దెబ్బతిందని కలెక్టర్ పి.ప్రశాంతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అత్తిలి, పాలకొల్లు, యలమంచిలి, ఆకివీడు, భీమవరం, ఇరగవరం మండలాల్లో దాళ్వా వరి పంట నేలవాలి దెబ్బతినగా 273 మంది సన్న, చిన్నకారు రైతులు, 30 మంది పెద్ద రైతులకు పంట నష్టం జరిగిందన్నారు. వారికి ఇన్‌పుట్ సబ్సిడీగా రూ.23.54 లక్షల పరిహారం అందచేయడానికి ప్రభుత్వానికి నివేదిక పంపినట్లు కలెక్టర్ పేర్కొన్నారు.

అనుమతి లేకుండా చెరువు తవ్వకంపై చర్యలు



కుప్పనపూడిలో అనుమతి లేకుండా తవ్విన చెరువును పరిశీలించిన ఆర్డీఓ దాసి రాజు

ఆకివీడు : అనుమతి లేకుండా తవ్వుతున్న చేపల చెరువులపై చర్యలు తప్పవని ఆర్డీఓ దాసి రాజు హెచ్చరించారు. మండలంలోని కుప్పనపూడిలో అనుమతి లేకుండా తవ్విన చెరువుపై మాజీ సర్పంచ్ మోటుపల్లి రాజు స్పందనలో చేసిన ఫిర్యాదుపై మంగళవారం విచారణ నిర్వహించారు. ఈ సందర్భంగా చెరువు ప్రాంతాన్ని పరిశీలించారు. ఫిర్యాదు చేసిన వ్యక్తికి నీటి సరఫరాకు ఆటంకం కల్గించలా పంట బోదులు లేకుండా చెరువు తవ్వినట్లు విచారణలో నిర్ధారణ అయిందని ఆర్డీఓ తెలిపారు. దీనిపై చర్యల కోసం ఆర్డీఓకు నివేదిక ఇవ్వాలని తహసీల్దార్ వెంకటేశ్వర్లు, వీఆర్వో జయరాజును ఆదేశించారు. వారి నివేదికతో పాటు తన నివేదికను చర్యల కోసం కలెక్టర్‌కు సమర్పిస్తానన్నారు. నిబంధనలకు విరుద్ధంగా చెరువు తవ్వుతుంటే ఎందుకు చర్యలు తీసుకోలేదన్నారు. స్పందనలో వచ్చిన మరికొన్ని ఫిర్యాదుల్ని ఆర్డీఓ పరిశీలించారు.

25, 27 తేదీల్లో జగనన్న ఆణిముత్యాలకు సత్కారం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): పదో తరగతి పరీక్షల్లో 2022–23 విద్యా సంవత్సరంలో వివిధ ప్రభుత్వ యాజమాన్యాల్లోని పాఠశాలల్లో చదివి ప్రతిభ చూపి, నియోజకవర్గ, జిల్లా స్థాయిల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు, అలాగే ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఈ నెల 25న నియోజకవర్గ స్థాయిలో, ఈ నెల 27న జిల్లా స్థాయిలో సత్కారాలు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్వీ రవిసాగర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏలూరు జిల్లాలో నియోజకవర్గ స్థాయిలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులు 59 మందిని, జిల్లా స్థాయిలో అన్ని ప్రభుత్వ యాజమాన్యాల్లోని పాఠశాలలకు చెందిన 35 మందిని సత్కరించడానికి ఎంపిక చేశామన్నారు. నియోజకవర్గ స్థాయిలో ఈ వేడుకకు మండల విద్యాశాఖాధికారిని కన్వీనర్‌గా నియమించామని చెప్పారు. నియోజకవర్గ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థికి రూ.15 వేలు, ద్వితీయ స్థానం రూ.10 వేలు, మూడో స్థానంలో నిలిచిన విద్యార్థికి రూ.5 వేలు అందచేస్తామన్నారు. జిల్లా స్థాయిలో ప్రథమస్థానంలో నిలిచిన విద్యార్థికి రూ.50 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన విద్యార్థికి రూ.30 వేలు, తృతీయ స్థానంలో నిలిచిన విద్యార్థికి రూ.15 వేలు నగదు పురస్కారం అందచేస్తామన్నారు. జిల్లా స్థాయి సత్కార కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖాధికారి కన్వీనర్‌గా వ్యవహరిస్తారని, వేడుక ఈ నెల 27న కలెక్టర్ కార్యాలయం ఆవరణలోని గోదావరి సమావేశ మందిరంలో జరుగుతుందని తెలిపారు.

సార్వా సాగుకు సన్నద్ధం

- జిల్లాలో 2 లక్షల ఎకరాల్లో వరి సాగు
- 40 వేల క్వింటాళ్ల వరి విత్తనాలు అవసరం



భీమవరం రైతు భరోసా కేంద్రంలో ఎరువులు తీసుకుంటున్న రైతులు

సాక్షి, భీమవరం: జిల్లాలో దాళ్వా మాసూళ్లు దాదాపు పూర్తికావడంతో ఇక సార్వా సాగుపై దృష్టిపెట్టారు. దాళ్వాలో పంట దిగుబడి ఆశాజనకంగా ఉన్నప్పటికీ అకాల వర్షాలు కొంత ఇబ్బందిపెట్టాయి. గత ఏడాది సార్వా నాట్లు ఆలస్యం కావడంతో దాని ప్రభావం దాళ్వాపై పడి పంట వర్షాలకు నష్టపోవాల్సివచ్చింది. సార్వా సకాలంలో వేస్తే దాళ్వా పంటలో కూడా ఇబ్బందులు ఉండవని దానికి అనుగుణంగా సార్వాకు ముందస్తు సన్నాహాలు చేసుకోవాలని రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

జిల్లాలోని 20 మండలాల్లో దాదాపు 2 లక్షల ఎకరాల్లో సార్వా నాట్లు వేయాల్సివుంటుంది. దీనికిగాను జూన్ మొదటి వారంలోనే కాలువలకు నీరు విడుదల చేస్తామని జనవనరుల శాఖ ముందుగానే ప్రకటించడంతో రైతులు కాలువలకు నీరువచ్చిన వెంటనే నారుమళ్లు వేసుకోవాలని సూచిస్తున్నారు. సార్వా సాగులో వరి విత్తనాలు దాదాపు 40 వేల క్వింటాళ్ల వరకు అవసరమవుతాయని వ్యవసాయశాఖ అంచనా. ఎక్కువ మంది రైతులు సొంతంగా విత్తనాలు సమకూర్చుకోవడమో లేక సమీప రైతుల నుంచి కొనుగోలు చేయడమో చేస్తుంటారు. అందువల్ల ప్రభుత్వ పరంగా వరి విత్తనాలు సమకూర్చాల్సిన అవసరం ఉండదు. అయినప్పటికీ సుమారు 3 వేల క్వింటాళ్ల విత్తనాలను రైతు భరోసా కేంద్రాల్లో సిద్ధం చేయడానికి అవసరమైన ఏర్పాట్లు చేశారు. వీటిలో సుమారు 300 క్వింటాళ్ల ఫౌండేషన్ సీడ్‌ను రైతులకు అందించేలా సిద్ధం చేస్తున్నారు.

17,938 మెట్రిక్ టన్నుల ఎరువులు సిద్ధం.....

జిల్లాలో రెండు లక్షలకు పైగా ఎకరాల్లో సార్వా నాట్లు వేయనున్నందున దానికి అవసరమైన ఎరువుల్లో సుమారు 17,938 మెట్రిక్ టన్నులు రైతు భరోసా కేంద్రాల ద్వారా సరఫరా చేయడానికి అవసరమైన ఏర్పాటు చేస్తున్నారు. దీనిలో 10,105 మెట్రిక్ టన్నుల యూరియా, 4,893 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్, 840 మెట్రిక్ టన్నుల డీఏపీ, 994 మెట్రిక్ టన్నుల ఎస్ఎస్‌పీ, 1,106 మెట్రిక్ టన్నుల ఎంఓపీ ఎరువును సిద్ధం చేస్తున్నారు.

సార్వాకు ముందస్తుగా సన్నద్ధం



సార్వా వరి సాగుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. అకాల వర్షాల కారణంగా దాళ్వా మాసూళ్లు ఇంకా కానప్పటికీ కాలువలకు నీరు రాగానే వరి నారు మళ్లు వేసుకునేలా రైతుల్లో చైతన్యం తీసుకురావడానికి కృషి చేస్తున్నాం. సార్వా సాగుకు అవసరమైన వరి విత్తనాలు ఎక్కువగా రైతులే స్వయంగా సమకూర్చుకునే అవకాశముంది. పంటకు అవసరమైన ఎరువులను కూడా రైతు భరోసా కేంద్రాల్లో నిల్వ చేయడానికి చర్యలు తీసుకున్నాం.

– జెడ్.వెంకటేశ్వరరావు,
జిల్లా వ్యవసాయశాఖాధికారి, భీమవరం

ముగిసిన ఈఏపీ సెట్ పరీక్షలు



సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో చివరి రోజు విద్యార్థుల హాల్ టిక్కెట్లను పరిశీలిస్తున్న సిబ్బంది

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): రాష్ట్రంలో అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల నిమిత్తం నిర్వహించే ఏపీ ఈఏపీ సెట్ పరీక్షలు మంగళవారంతో ముగిశాయి. ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాలోని 10 పరీక్షా కేంద్రాల్లో మొత్తం 3,016 మందికి 2,822 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఏలూరు జిల్లాలో సిద్ధార్థ క్వెస్ట్ సెంటర్‌లో జరిగిన పరీక్షల్లో ఉదయం 181 మందికి 167 మంది, మధ్యాహ్నం 181 మందికి 176 మంది, ఏలూరు ఇంజనీరింగ్ కళాశాలలో ఉదయం 139 మందికి 134 మంది, మధ్యాహ్నం 139 మందికి 134 మంది హాజరయ్యారు. సీఆర్ఆర్ కళాశాలలో ఉదయం 150 మందికి 148 మంది, మధ్యాహ్నం 150 మందికి 148 మంది హాజరయ్యారు. పశ్చిమ గోదావరి జిల్లాలోని 7 పరీక్షా కేంద్రాల్లో ఉదయం 1034 మందికి 957 మంది హాజరు కాగా, మధ్యాహ్నం 1032 మందికి 958 మంది హాజరయ్యారు.

పెయ్యి దూడల కోసం కృత్రిమ గర్భధారణ పథకం



కుప్పనపూడిలోని ఆర్బీకేలో పశు విజ్ఞాన బడి కార్యక్రమంలో మాట్లాడుతున్న వెటర్నరీ డీడీ జవహర్ హుస్సేన్

ఆకివీడు: పెయ్యి దూడల ఉత్పత్తి కోసం ప్రభుత్వం కృత్రిమ గర్భధారణ పథకం ప్రవేశపెట్టిందని పశు సంవర్ధక శాఖ ఉప సంచాలకులు జవహర్ హుస్సేన్ చెప్పారు. మండలంలోని కుప్పనపూడిలోని ఆర్బీకే వద్ద మంగళవారం పశు విజ్ఞాన బడి కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ పెయ్యి దూడ స్పెర్మ్‌ను రెండు పర్యాయాలు పశువులకు అందజేస్తారని చెప్పారు. రూ.1350 విలువైన దీనిని ప్రభుత్వం రూ. 500కు సబ్సిడీపై అందజేస్తుందని చెప్పారు. రెండు పర్యాయాలు పాడి పశువులకు సూడి కట్టేందుకు వేస్తారని.. సూడి కట్టని పక్షంలో రైతుల సొమ్మును తిరిగి అందజేస్తారన్నారు. పుంగనూరు ఆవులకు కావలసిన స్పెర్మ్‌ను కూడా రైతులు ఆర్బీకేల వద్ద రిజిస్టర్ చేయించుకుంటే అందుబాటులోకి తీసుకువస్తామని డీడీ వివరించారు. జాతీయ పశు బీమా పథకంను ప్రప్రథమంగా రాష్ట్రంలో అమలుజేస్తున్నారని చెప్పారు.

ఫిట్‌నెస్ ఉంటేనే అనుమతి

- స్కూల్, కాలేజీ బస్సులకు సామర్థ్య పరీక్షలు
- జిల్లాలో 800 స్కూలు, కళాశాల బస్సులు



భీమవరంలో స్కూల్ బస్‌కు ఫిట్‌నెస్ పరీక్షలు చేస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశం చౌక్) : వేసవి సెలవులు అనంతరం కళాశాలలు, పాఠశాలలు మరో మూడు వారాల్లో ప్రారంభంకానున్నాయి. దీంతో ముందుగానే స్కూళ్లు, కళాశాల బస్సుల ఫిట్‌నెస్ పరీక్షలను రవాణా శాఖ చేపట్టింది. ఇప్పటికే రవాణా శాఖ కార్యాలయాల్లో బస్సుల ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. స్కూళ్లు, కాలేజీలు తెరిచేలోపు బస్సులు ఫిట్‌నెస్ పరీక్షల్లో పాసవ్వాలని రవాణా శాఖ అధికారులు స్పష్టం చేస్తున్నారు.

జిల్లాలోని భీమవరం, తాడేపల్లిగూడెం, తణుకు, పాలకొల్లు రవాణా శాఖ కార్యాలయాలల్లో మోటారు వెహికల్ ఇన్స్‌పెక్టర్లు, సిబ్బంది ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. స్కూళ్లు, కళాశాల యాజమాన్యంతో మాట్లాడి వారి బస్సులను ఫిట్‌నెస్ పరీక్షలు రప్పించడం, బస్సుల ఉన్న ప్రాంతానికే రవాణా శాఖ అధికారులు వెళ్లి ఫిట్‌నెస్ పరీక్షలు చేయడం చేస్తున్నారు. స్కూళ్లు, కళాశాలలు తెరిచే లోపు బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు పూర్తి చేసుకుని.. ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పొంది బస్సులను సిద్ధంగా ఉంచుకొవాలని రవాణా శాఖ అధికారులు సూచిస్తున్నారు.

ఫిట్‌నెస్ పరీక్షలు ఇలా..

స్కూల్ బస్సులను మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్లు స్వయంగా డ్రైవ్ చేస్తారు. బస్సు లోపల, బయట పూర్తిగా పరిశీలించి మరమ్మత్తులు చేయాల్సినవి గుర్తిస్తారు. డ్రైవింగ్‌కు సంబంధించి బ్రేకులు, క్లచ్, స్టీరింగ్, హ్యాండ్ బ్రేక్, బ్యాటరీ, ఇంజిన్‌కు సంబంధించి పలు విభాగాలను పరిశీలిస్తారు. బస్సులోని అత్యవసర ద్వారాలు, కిటికీలు, టైర్లు, సీట్లు, ఇలా ప్రతి దానిని పూర్తిగా పరిశీలించి అన్ని బాగున్నాయని సంతృప్తి చెందిన తర్వాత ఫిట్‌నెస్ సర్టిఫికెట్ జారీ చేస్తారు.

స్కూల్ బస్సు నడిపే వారికి నిబంధనలు..

- ఐదేళ్ల అనుభవంతో కూడిన భారీ వాహన లైసెన్సు ఉండాలి.
- డ్రైవరు వయసు 60 ఏళ్ల లోపు ఉండాలి.
- శారీరక దారుఢ్యం కలిగి ఉండాలి, పూర్తి ఆరోగ్యంగా ఉన్నట్లు ధ్రువీకరణ పత్రం ఉండాలి.
- డ్రైవర్, సహాయకుడు యూనిఫాం ధరించాలి.
- వేగంగా, నిర్లక్ష్యంగా బస్సు నడపరాదు.
- బస్సుల్లో ప్రథమ చికిత్స బాక్సు ఉండాలి
- బస్సులోకి విద్యార్థులు ఎక్కేందుకు, దిగేందుకు ఆధారంగా రెండు వైపులా ఇనుపకడ్డీలు ఉండాలి
- బస్సు ముందు భాగంలో పాఠశాల పేరు, చిరునామా, ఫోను నెంబర్లు ఉండాలి.

ఫిట్‌నెస్ టెస్ట్‌లో పాసైతేనే నడిపేందుకు అనుమతి



స్కూల్ బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహిస్తున్నాం. అన్ని సక్రమంగా ఉంటేనే ధ్రువీకరణ పత్రం జారీ చేస్తాం. జిల్లాలోని నాలుగు రవాణా శాఖ కార్యాలయాల వద్ద ఫిట్‌నెస్ పరీక్షలు జరుగుతున్నాయి. ఫిట్‌నెస్ లేకపోతే ఎట్టి పరిస్థితుల్లోను బస్సు రన్నింగ్‌కు అనుమతించం. ఫిట్‌నెస్ పరీక్ష చేయించకుండా బస్సులు నడిపితే కేసులు నమోదు చేసి తగు చర్యలు తీసుకుంటాం.

టి.ఉమామహేశ్వరరావు,
జిల్లా రవాణా శాఖ అధికారి, భీమవరం

ఇంతవరకు 300 బస్సులకు పరీక్షలు పూర్తి

జిల్లాలో 800 వరకూ స్కూల్ బస్సులు ఉండగా ఇంతవరకు సుమారు 300 బస్సుల వరకు అధికారులు ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించారు. మిగిలిన బస్సులకు పరీక్షలు నిర్వహించడానికి చర్యలు తీసుకుంటున్నారు. వాటిలో ఫిట్‌నెస్ ఉన్న వాటికి ధ్రువీకరణ పత్రం జారీ చేస్తున్నారు. మరమ్మతులు చేయాల్సిన వాటికి సమయం ఇచ్చి ఫిట్‌నెస్‌కు రావాలని ఆదేశిస్తున్నారు.

చేదును మిగిల్చిన మామిడి

- గత నాలుగేళ్లుగా తగ్గిన దిగుబడి
- నాణ్యత లేకపోవడంతో పెరగని ధర



మామిడి మార్కెట్‌లో అమ్మకానికి సిద్ధంగా ఉన్న మామిడి కాయలు, ఇన్‌సెట్‌లో మామిడి తోటలో కోసిన బంగినపల్లి రకం కాయలు

నూజివీడు: పండ్లలో రారాజుగా ఒకప్పుడు రైతుకు తీపిని పంచిన మామిడి గత కొన్నాళ్లుగా చేదును మిగిల్చుతోంది. మామిడి పంట దిగుబడి గణనీయంగా పడిపోవడంతో రైతు పరిస్థితి ముందు నుయ్యి వెనుక గొయ్యి అన్న చందంగా తయారైంది. మొత్తంగా మామిడి పంట సంక్షోభం దిశగా పయనిస్తోంది.

ఏలూరు జిల్లాలో 63 వేల ఎకరాల్లో సాగు

ఏలూరు జిల్లాలోని నూజివీడు డివిజన్‌లోను, ఎన్టీఆర్ జిల్లాలోని తిరువూరు డివిజన్‌లో వరిపంట తరువాత రైతులకు మామిడే ప్రధాన పంట. ఇది వాతావరణ ఆధారిత పంట కావడంతో డిసెంబరు నుంచి మే వరకు వాతావరణ పరిస్థితులు కీలకం. ఈ రెండు డివిజన్‌లలో 1.40 లక్షల ఎకరాల్లో మామిడి తోటలు విస్తరించి ఉండగా, ఇందులో ఏలూరు జిల్లాలో 63,560 ఎకరాల్లో మామిడితోటలు విస్తరించి ఉన్నాయి. సార్వా సీజన్‌లో వరి సాగుచేసే ఈ ప్రాంత రైతులు దాళ్వా సీజన్ వచ్చే సరికి మామిడిపైనే ఆశలు పెట్టుకుని ముందుకు సాగుతారు. బంగినపల్లి, తోతాపురి(కలెక్టర్), చిన్నరసాలు, పెద్దరసాలు వంటి రకాలను రైతులు సాగుచేస్తున్నారు.

మూడు విడతలుగా పూత

ఈ ఏడాది మామిడి తోటలలో పూత మూడు విడతలుగా వచ్చింది. డిసెంబరు నెలలో ఒకసారి, జనవరి ప్రథమార్థంలో రెండోసారి, ఫిబ్రవరి మొదటి వారంలో మూడో విడతగా పూతలు వచ్చాయి. ఇందులో మొదటి విడతలోను, మూడో విడతలో వచ్చిన పూత నిలిచింది. అయితే ఈ ఏడాది ప్రతికూల వాతావరణం వల్ల పూత, పిందె నిలిచేందుకు రైతులు మామిడి తోటలకు 14 సార్లు వరకు పురుగుమందులు పిచికారీ చేశారు. దీంతో రైతులకు పెట్టుబడులు గతంలో కంటే విపరీతంగా పెరిగిపోయాయి.

దెబ్బతీసిన అకాల వర్షాలు

ఆశాజనంగా వచ్చిన దిగుబడిని అకాల వర్షాలు దెబ్బతీశాయి. మార్చి, ఏప్రిల్, మే నెలల్లో కురిసిన వర్షాల కారణంగా మామిడి కాయలు నాణ్యతలో దెబ్బతిన్నాయి. మసిమంగు, రాతిమంగు తదితర తెగుళ్ల ఆశించడంతో మార్కెట్‌లో ధర గణనీయంగా పతనమైంది. బంగినపల్లి రకం కాయలకు మార్చి ప్రారంభంలో టన్ను ధర రూ.40 వేల నుంచి రూ.50 వేల వరకు ఉండగా, రానురాను దిగజారి ప్రస్తుతం రూ.5 వేలు కూడా లేదు. దీంతో కోత కూలి, రవాణా ఖర్చులు కూడా రాని పరిస్థితి నెలకొంది. రైతులు స్థానికంగా ఉన్న కమిషన్ వ్యాపారులకు, విజయవాడ సమీపంలోని నున్న మ్యాంగో మార్కెట్‌కు కాయలను తీసుకెళ్లి విక్రయిస్తారు. ఉత్తరాది రాష్ట్రాల నుంచి వచ్చే వ్యాపారులు మామిడి కాయలను కొనుగోలు చేస్తారు. ఈ ఏడాది బంగినపల్లి రకం కంటే తోతాపురి రకంకు గతంలో ఎన్నడూ లేని విధంగా ధర ఆశాజనకంగా ఉంది. టన్ను తోతాపురికి రూ.10 వేల నుంచి రూ.13 వేల ధర లభిస్తోంది.

నున్న మార్కెట్ నుంచి గత నాలుగేళ్లలో ఎగుమతి

సంవత్సరం	టన్నుల్లో
2019	32,500
2020	26,100
2021	19,500
2022	15,600
2023	10,400(ఇప్పటి వరకు)

పడిపోతున్న నాణ్యత:

మామిడి బెట్ట పంట. అయితే రైతులు మామిడి తోటలపై ఎక్కువ ఆదాయాన్ని పొందాలనే లక్ష్యంతో మామిడి తోటల్లో దమ్ము చేయడం, తరచూ నీటి తడులు ఇవ్వడం వల్ల తోటల్లో మామిడికి హాని చేసే పురుగులు, కీటకాల ఉధృతి పెరిగి, వాటి వల్ల కాయలకు తెగుళ్ల సోకి నాణ్యత పడిపోతోంది. ఉద్యాన అధికారులు, మామిడి శాస్త్రవేత్తలు ఎంత చెబుతున్నా రైతులు వారి సూచనలను పెడచెవిన పెడుతున్నారు. ఇలా చేస్తుండటంతో ఏడాదికేడాదికి తెగుళ్ల బెడద పెరగడం, కాయ నాణ్యత పడిపోవడం జరుగుతోంది.

నేడు కొవ్వూరుకు సీఎం జగన్.. ట్రాఫిక్ మళ్లింపు

కొవ్వూరు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు రానున్నారు. జగనన్న వసతి దీవెన రాష్ట్ర స్థాయి కార్యక్రమంలో ఆయన పాల్గొంటారు. సీఎం పర్యటన నేపథ్యంలో ట్రాఫిక్‌ను మళ్లిస్తున్నారు. ముఖ్యమంత్రి పర్యటనకు 1,600 మంది పోలీసులతో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు.

ట్రాఫిక్ మళ్లింపు ఇలా..

- ఏలూరు వైపు నుంచి బహిరంగ సభకు వచ్చే వాహనాలను బైపాస్ రోడ్డులో ఏసీఆర్ లాడ్జి మీదుగా లోపలికి అనుమతిస్తారు.
- రోడ్డు–కం–రైలు వంతెన మీదుగా వచ్చే వాహనాలను బైపాస్ రోడ్డు.. రైల్వే స్టేషన్ మీదుగా సభా ప్రాంగణం వైపు పంపిస్తారు.
- తాళ్లపూడి వైపు నుంచి వచ్చే వాహనాలను బైపాస్ రోడ్డులో ఏసీఆర్ లాడ్జి మీదుగా నందమూరు రోడ్డు నుంచి సభ ప్రాంగణం వైపు పంపిస్తారు.
- గామన్ ఇండియా బ్రిడ్జి మీదుగా వచ్చే వాహనాలు కూడా బైపాస్ రోడ్డులో లోపలికి అనుమతిస్తారు.
- చాగల్లు, నందమూరు, వేములూరు, నిడదవోలు వైపు నుంచి వచ్చే వాహనాలను బైపాస్ రోడ్డు మీదుగా రైల్వే స్టేషన్ వైపు పంపిస్తారు.
- ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పట్టణంలోకి భారీ వాహనాలు, సరుకు రవాణా వాహనాలు అనుమతించరు.
- ఉదయం 11 గంటల నుంచి రోడ్డు–కం–రైలు వంతెన, ధవళేశ్వరం ఆనకట్ట రోడ్డులో వన్‌వే అమలులో ఉంటుంది.

31న ప్రధానోపాధ్యాయులు, సిబ్బందికి కౌన్సెలింగ్

బుట్టాయగూడెం: గిరిజన సంక్షేమ శాఖ విద్యాలయాల్లో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులు, బోధన, బోధనేతర సిబ్బంది, నాల్గో తరగతి సిబ్బంది, వసతి గృహ అధికారుల బదిలీల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఐటీడీఏ ఏపీఓ, ఇన్‌చార్జి డీడీ పీవీఎస్ నాయుడు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ నెల 31లోపు బదిలీ కౌన్సిలింగ్ పూర్తి చేసుకోవాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయని అన్నారు. బదిలీ ప్రక్రియ కోరుకునే ప్రధానోపాధ్యాయులు బోధన, బోధనేతర సిబ్బంది, నాల్గో తరగతి సిబ్బంది, వసతిగృహ అధికారులు బదిలీ కోసం విన్నపం చేసుకున్న వారికి మాత్రమే బదిలీలు జరుగుతాయని చెప్పారు. ఒక స్టేషన్‌లో 5 సంవత్సరాలు పూర్తి చేసుకున్న వారిని తప్పనిసరిగా బదిలీ చేస్తారన్నారు. బదిలీ కోసం దరఖాస్తు చేసుకునే సిబ్బంది వారు పనిచేసే స్టేషన్‌లో కనీసం 2 సంవత్సరాల సర్వీస్ పూర్తి చేసుకుని ఉండాలన్నారు. ప్రధానోపాధ్యాయులు, బోధనా సిబ్బంది ఈ నెల 26 సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తులు సమర్పించాలని అన్నారు. వసతిగృహ అధికారులు, బోధనేతర, నాలుగో తరగతి సిబ్బంది ఈ నెల 25లోపు దరఖాస్తులు సమర్పించాలని, తాత్కాలిక సీనియారిటీ జాబితాను ఈ నెల 27న అందజేయాలన్నారు. అభ్యంతరాలు ఈ నెల 28 సాయంత్రం 5 గంటల వరకూ స్వీకరిస్తారని చెప్పారు.

నేటి నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు బుధవారం నుంచి ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా వ్యాప్తంగా ప్రారంభంకానున్నాయి. ఈ పరీక్షలకు సర్వం సిద్ధం చేసినట్లు ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి కే చంద్రశేఖర బాబు తెలిపారు. ఏలూరు జిల్లాలో 24 కేంద్రాలు, పశ్చిమ గోదావరి జిల్లాలో 34 కేంద్రాలు, తూర్పుగోదావరి జిల్లాలో 11 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షల్లో ప్రథమ సంవత్సరం జనరల్ విద్యార్థులు 20,927 మంది, ఒకేషనల్ విద్యార్థులు 1,979 మంది హాజరు కానున్నారని, ద్వితీయ సంవత్సరం నుంచి 9,297 మంది జనరల్ విద్యార్థులు, 2089 మంది ఒకేషనల్ విద్యార్థులు హాజరు కానున్నారని తెలిపారు. పరీక్షల నిమిత్తం 4 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, 4 సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు, 4 జిల్లా స్థాయి పరీక్షల కమిటీ బృందాలు, ఒక హైపవర్ కమిటీ నిరంతరం పర్యవేక్షించడానికి నియమించామన్నారు.

క్లుప్తంగా

రెజ్లర్లకు మద్దతుగా కొవ్వొత్తుల ర్యాలీ


కొవ్వొత్తుల ర్యాలీ చేస్తున్న దృశ్యం

ఏలూరు (టూటౌన్): లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్‌ను అరెస్టు చేయాలని కోరుతూ ఢిల్లీలో మహిళా రెజ్లర్లు చేస్తోన్న పోరాటానికి మద్దతుగా ఏలూరులో ఇఫ్టూ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇఫ్టూ రాష్ట్ర సహాయ కార్యదర్శి యు.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ బేటీ బచావో, బేటీ పడావో అనే నినాదం ఇచ్చే ప్రధాని మహిళలకు ఎక్కడ రక్షణ కల్పిస్తున్నారని ప్రశ్నించారు. దేశానికి కీర్తి ప్రతిష్టలు తీసుకొచ్చి బంగారు పతకాలు సాధించిన మహిళా రెజ్లర్లను లైంగికంగా వేధించిన ఎంపీని ఎందుకు అరెస్టు చేయడంలేదన్నారు. సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని ఎంపీ బ్రిజ్ భూషణ్ అరెస్టుకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఇఫ్టూ నాయకులు కాకర్ల అప్పారావు, వీరినాయుడు, మంగం అప్పారావు, నాగేశ్వరరావు, అన్నవరం, ఈశ్వరరావు, కృష్ణ, రమణ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడి ఆత్మహత్య

జంగారెడ్డిగూడెం: స్థానిక ఉప్పలమెట్టపై ఒక వృద్ధుడు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గెద్దాడ సుధీర్ (65) అనే వ్యక్తి ఉప్పలమెట్టపై తన ఇంట్లో ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు.

అధిక ఉష్ణోగ్రతలతో ఆక్వా రంగం ఉక్కిరిబిక్కిరి

- తలెత్తనున్న నీటి కాలుష్యం, ఆక్సిజన్ లేమి
- చేపలకు చెడ్డ కాలం
- రైతుల్లో ఆందోళన
- గురువారం నుంచి రోహిణి కార్తె


చేపల పట్టుబడి చేస్తున్న దృశ్యం

కైకలూరు: ఆక్వా రంగాన్ని అధిక ఉష్ణోగ్రతలు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. దీనికి తోడు రోహిణి కార్తెతో గురువారం నుంచి ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరిస్తోంది. చేపలు శీతల జలాచరాలు. వీటికి అనుకూల స్థాయి నీటి ఉష్ణోగ్రతలు 20 డిగ్రీల సెంటీగ్రేట్ నుంచి 30 డిగ్రీల సెంటీగ్రేట్ మధ్య ఉంటాయి. ఇటీవల జిల్లాలో ఉష్ణోగ్రతలు 41 డిగ్రీల సెంటీగ్రేట్ వరకు పెరిగాయి. ఈ పరిణామం చేపల, రొయ్యల రైతులను కలవర పెడుతోంది. చెరువుల్లో నీరు ఆవిరవడం వల్ల ఉష్ణోగ్రతలు పెరిగి ఆక్సిజన్ లేమి, నీటి కాలుష్యం, విషవాయువుల ఉత్పత్తి వంటి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి.

2.60 లక్షల ఎకరాల్లో సాగు

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలో 1.40 లక్షల ఎకరాల్లో చేపలు, 1.20 లక్షల ఎకరాల్లో రొయ్యల సాగు చేస్తున్నారు. అధిక ఉష్ణోగ్రతల ప్రభావానికి చెరువుల్లో ఆక్సిజన్ సమస్యత తలెత్తుతోంది. సేంద్రియ పదార్థాలు చెరువు అడుగు భాగానికి చేరి విషతుల్యమవుతున్నాయి. ప్రధానంగా రాత్రి వేళల్లో కిరణజన్య సంయోగక్రియకు ఆటంకం ఏర్పడుతుంది. చేపల్లో శ్వాసక్రియ సమస్య ఏర్పడి ముట్టెలు పైకెత్తి మృత్యువాతపడుతున్నాయి. వేసవిలో మూడు అడుగుల కంటే నీటిమట్టం తక్కువ ఉన్న చెరువుల్లో చేపల మరణాలు అధికమవుతాయి.

సమ్మర్ కిల్

ఎండాకాలంలో వాతావరణ మార్పుల వల్ల చేపలు చనిపోవడాన్ని సమ్మర్ కిల్ అంటారు. వేసవిలో సూర్యరశ్మి వల్ల చెరువుపై భాగంలో రెండడుగుల మేర నీరు వేడెక్కుతోంది. వేడి నీరు తేలికగా ఉంటుంది. అడుగు భాగాన చల్లగా ఉన్న నీరు బరువుగా ఉంటుంది. సమ్మర్ కిల్‌కి దారితీసే ప్రధాన అంశం ఇదే. చెరువుల్లో భౌతిక, రసాయన గుణాలున్న నీటి ఉష్ణోగ్రత, ప్లాంక్టాన్, ఆక్సిజన్, ఉదజని సూచిక విలువలు, కార్బన్ డయాక్సైడ్, అమ్మోనియా వంటి హానికర వాయువులు వివిధ లోతులలో వివిధ స్థాయిల్లో ఉంటాయి. నీటి ఉపరితలం నుంచి అడుక్కు వెళ్లే కొలదీ నీటి ఉష్ణోగ్రత, ఆక్సిజన్ స్థాయి తగ్గిపోతాయి. దీంతో చేపలు మృత్యువాత పడతాయి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- చెరువులో మూడు అడుగుల లోతులో నీరు తగ్గకుండా చేయాలి.
- చేపల చెరువులో ఆక్సిజన్ సమస్య పరిష్కారానికి తెల్లవారుజామున మూడు నుంచి ఆరు గంటల వరకు నీటిని కలయతిప్పుతూ ఉండాలి.
- చెరువుల్లో కూడా ఆక్సిజన్ ఉత్పత్తి చేసే ఏరియాటర్లను ఉపయోగించాలి.
- జియోలైట్, కాల్షియం పెరాక్సైడ్, ఆక్సిజన్ డబ్లెట్లు వంటివి అందుబాటులో ఉంచుకోవాలి.
- చెరువుల్లో మేతలను సగానికి తగ్గించుకోవాలి.
- చెరువుల్లో పాతనీటి స్థానంలో అవకాశాన్ని బట్టి కొత్త నీటిని నింపుకోవాలి.
- చెరువుపై పక్షులు ఎక్కువగా సంచరిస్తుంటే ఎక్కడైనా చేపల మరణించాయా అనే విషయాన్ని గమనించాలి.
- ఆక్సిజన్ సమస్యను అధికమించడానికి చెరువులో నీటిని యంత్రాల ద్వారా తిరిగే అదే చెరువులోకి నింపే పద్ధతిని అనుసరించవచ్చు.
- చెరువులో నీటి, మట్టి పరీక్షలు ఎప్పటికప్పుడు చేయించాలి.

నీటి పరీక్షలు చేయించాలి



వేసవిలో ఉష్ణోగ్రతల ప్రభావం చేపల సాగుపై పడుతోంది. ప్రధానంగా ఆక్సిజన్ సమస్య ఉత్పన్నమవుతోంది. రైతులు ఆక్సిజన్ మాత్రలను అందుబాటులో ఉంచుకోవాలి. నీటి పరీక్షలు తరచుగా చేయించాలి. పీహెచ్ విలువలు తెలుసుకోవాలి. ప్రభుత్వం క్షేత్ర స్థాయిలో మత్స్యశాఖ సహాయకులను నియమించింది. అధికారుల సూచనలు, సలహాలు పాటించాలి.

– ఎం.భవిత, మత్స్యశాఖ అభివృద్ధి అధికారిణి, కైకలూరు

వేసవి వ్యాధులతో జాగ్రత్త



వేసవిలో ఉష్ణోగ్రతలు పెరగటంతో ఆక్సిజన్ సమస్య చెరువుల్లో కనిపిస్తోంది. దీంతో చేపలకు శంఖుజలగ, రెడ్ డిసీజ్, పేను వంటి వ్యాధులు ఎక్కువగా వచ్చే అవకాశం ఉంటుంది. ప్రధానంగా కోళ్ల ఎరువులను వేసవిలో చెరువుల్లో వేయడం మానివేయాలి. రొయ్యల చెరువుల మాదిరిగా చేపల చెరువుల్లోనూ ఆక్సిజన్ ఏరియాటర్లను ఏర్పాటు చేసుకోవాలి.

– దండు రంగరాజు, ఆక్వారైతు, కైకలూరు

రెల్లి క్రికెట్ విజేత రామచంద్రపురం జట్టు


క్రికెట్ విజేతలకు కప్పు అందిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: భీమవరం డీఎన్నార్ కళాశాల ఆవరణలోని గన్నాబత్తుల క్రీడామైదానంలో నిర్వహించిన ధనాల లక్ష్మీనరసింహ మెమోరియల్ రాష్ట్ర స్థాయి రెల్లి క్రికెట్ టోర్నమెంట్ విజేతగా రామచంద్రపురం జట్టు నిలిచింది. మంగళవారం నిర్వహించిన ఫైనల్ పోటీల్లో గుడివాడ జట్టుపై రామచంద్రపురం జట్టు గెలిచింది. విన్నర్స్‌కు రూ.50 వేలు, రన్నర్స్‌కు రూ.30 వేలు నగదు, షీల్డ్స్‌ను రాష్ట్ర రెల్లి కార్పొరేషన్ చైర్మన్ వడ్డాది మధుసూదన్ రావు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా మధుసూదన్‌రావు మాట్లాడుతూ రెల్లి సంఘం ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు నిర్వహించడం స్ఫూర్తిదాయకమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సంఘస్తుల్లో ఐక్యతను పెంపొందించేందుకు ఇటువంటి పోటీలు ఎంతగానో దోహదం చేస్తాయని చెప్పారు. కార్యక్రమంలో రెల్లికుల సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొచ్చ ధర్మ, సంఘం జిల్లా నాయకులు నీలాపు వెంకట్, సోమాదుల పైడిరాజు, ధనాల సాయిబాబు, నీలాపు శ్రీను, డి.మురళి, ధనాల పవన్, సంఘం పట్టణ నాయకులు పాల్గొన్నారు.

చంద్రబాబు కుల రాజకీయాలను తిప్పికొట్టాలి


సమావేశంలో మాట్లాడుతున్న మంగరాజు

తాడేపల్లిగూడెం (టీఓసీ): టీడీపీ నాయకుడు చంద్రబాబు నాయుడు గతంలో మాదిరిగానే నేడూ ఎంఆర్‌పీఎస్ నాయకుడు మంద కృష్ణను అడ్డుపెట్టుకొని చేస్తోన్న కుల రాజకీయాలను తిప్పికొట్టాలని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు దళితులకు విజ్ఞప్తి చేశారు. తాడేపల్లిగూడెంలో మాలమహానాడు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ ఎస్సీ సెల్ పేరుతో విజయవాడలో సమావేశం ఏర్పాటుచేసి రాష్ట్ర ప్రభుత్వంపై అవాకులు, చవాకులు పేలడం సరికాదని పేర్కొన్నారు. మందకృష్ణను ఆంధ్రాలో ఎప్పుడో తరిమేశారని, నేడు ఆయనకిక్కడ పని ఏమిటి ప్రశ్నించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్ల పాలనలో దళితులకే కాకుండా అన్ని వర్గాలకూ మేలు చేస్తున్నారని వివరించారు. అమరావతిలో త్వరలో సీఎం జగన్ చేతుల మీదుగా దళిత, బహుజనులకు ఇళ్ల పట్టాలు మంజూరు చేస్తుండడాన్ని మంగరాజు స్వాగతించారు. వైఎస్సార్‌సీపీ మీదకు ఎన్ని పార్టీలతో కలిసి వచ్చినా, అసత్య ప్రకటనలు చేసినా రానున్నది జగన్ ప్రభుత్వమే అని వివరించారు. రాష్ట్రంలో మాలలు గతంలో ఎస్సీ వర్గీకరణ విషయంలో మాలల పంతం, చంద్రబాబు అంతం అనే నినాదంతో ఎలా పనిచేశారో అదే విధంగా మాలలు చంద్రబాబుకు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని, మాలల వ్యతిరేకి చంద్రబాబు అని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఇస్తోన్న సెంటు భూమి శ్మశానికి సరిపోతుందని చంద్రబాబు అనడాన్ని తీవ్రంగా ఖండించారు. సమావేశంలో రాజారావు, మోహన్, సందీప్, సునీల్‌బాబు, లూథర్, గోపి, రోహిత్‌లు పాల్గొన్నారు.

● గడప గడపకు సంక్షేమం


పాలకోడేరు: మండలంలోని వేంద్ర గ్రామంలో మహిళలకు పథకాల లబ్ధిని వివరిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు

30న చింతలపూడిలో మెగా జాబ్ మేళా

ఏలూరు రూరల్: నిరుద్యోగ యువతీ యువకుల కోసం ప్రభుత్వం మెగా జాబ్ మేళా నిర్వహిస్తోందని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా యువ అధికారి దూలం కిషోర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జిల్లా ఉపాధి కార్యాలయ అధికారులు ఈ నెల 30న చింతలపూడి బాలికల ఉన్నత పాఠశాలలో మేళా నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. మేళాలో 18కి పైగా ప్రముఖ కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని, మెకానిజం, ఫౌండ్రీ, ఆటోకార్డ్ ఇంజినీర్, జేఈఆర్, ఎస్ఆర్ఈ, సీసీఈ తదితర విభాగాల్లో ఉద్యోగాలు కల్పిస్తారని తెలిపారు. ఏడో తరగతి నుంచి ఎస్ఎస్‌సీతో పాటు ఇంటర్మీడియట్, ఎంబీఏ, బీటెక్, ఐటీఐ, బీఎస్సీ, డిప్లమాతో పాటు ఇతర డిగ్రీ ఉన్నవారూ అర్హులని పేర్కొన్నారు. చెన్నై, తిరుపతి, చిత్తూరు, హైదరాబాద్, తూర్పుగోదావరి, రాజమండ్రి, నాయుడుపేట, గుంటూరు తదితర ప్రాంతాల్లో ఉద్యోగాలు పొందవచ్చని, నెలకు జీతం రూ.12 వేల నుంచి రూ.20 వేలకుపైగా ఉంటుందని తెలిపారు. ముందుగా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, మరింత సమాచారం కోసం సెల్ నెంబర్లు 96525 03799, 90008 03414, 96663 22032లో సంప్రదించాలని సూచించారు.

గుండె పోటుతో ఉద్యోగి మృతి

జంగారెడ్డిగూడెం: గుండెపోటుతో ఆర్అండ్ఆర్ శాఖలో హౌసింగ్ కార్పొరేషన్ ఇన్‌స్పెక్టర్ మృతిచెందినట్టు జంగారెడ్డిగూడెం పోలీస్‌స్టేషన్ హెచ్‌సీ పీసీ హెచ్ శ్రీనివాసరావు తెలిపారు. ఆర్అండ్ఆర్ శాఖలో హౌసింగ్ కార్పొరేషన్ ఇన్‌స్పెక్టర్ (ఔట్ సోర్సింగ్) దళపతిరావు పవన్‌కుమార్ (45) మంగళవారం ఉదయం ఆర్అండ్ఆర్ కార్యాలయం వద్ద స్పృహ తప్పి పడిపోయి ఉండటాన్ని సహ ఉద్యోగులు గుర్తించారు. స్థానిక ప్రైవేట్ ఆసుపత్రికి, అనంతరం జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఆయా ఆస్పత్రుల వైద్యులు పరీక్షించి పవన్‌కుమార్ మృతిచెందినట్టు గుర్తించారని సహ ఉద్యోగులు తెలిపారు. పవన్‌కుమార్ సోదరుడు కిషోర్‌కుమార్ తన అన్న మృతిపై ఫిర్యాదు చేశారు. పవన్‌కుమార్ ఏడాదిగా గుండె సంబంధిత వ్యాధికి చికిత్స పొందుతున్నాడని, మందులు కూడా వాడుతున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని హెచ్‌సీ శ్రీనివాసరావు తెలిపారు.

మన్యంలో 'అనన్య' షూటింగ్ సందడి


జల్లేరు జలాశయం వద్ద షూటింగ్ సందడి

బుట్టాయగూడెం: శ్రీసిద్ధిదాత్రి మూవీ క్రియేషన్స్ బ్యానర్‌పై నిర్మిస్తోన్న అనన్య చిత్రం షూటింగ్ మంగళవారం మన్యం ప్రాంతం బుట్టాయగూడెం మండలం దొరమామిడి సమీపంలోని గుబ్బల మంగమ్మతల్లి జల్లేరు జలాశయం పరిసర ప్రాంతంలో నిర్వహించారు. హీరో, హీరోయిన్‌లతో ఒక పాట చిత్రీకరించారు. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు బొమ్మిడి ప్రసాద్‌రాజు విలేకర్లతో మాట్లాడుతూ మనిషి చనిపోయినప్పటికీ ప్రేమ బతికే ఉంటుందనే కాన్సెప్ట్‌తో అనన్య చిత్రాన్ని నిర్మిస్తున్నామని చెప్పారు. ఈ చిత్ర షూటింగ్ జంగారెడ్డిగూడెంలో తిరుమలాపురం, వీరన్నగూడెం, వేగవరం నోవా కాలేజీ, తదితర ప్రాంతాల్లో 70 శాతం వరకు పూర్తిచేశామన్నారు. ఈ చిత్రంలో ఒక ఐటమ్ సాంగ్‌ను చిత్రీకరించామని తెలిపారు. అరకులో రెండు పాటలు చిత్రీకరించనున్నట్టు చెప్పారు. ఆగస్టులో ఈ చిత్రం రిలీజ్‌కు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ చిత్ర నిర్మాత తాళ్లపూడికి చెందిన జంద్యాల గంగాధర్ శర్మ, మొదటి హీరో వెంకట్, రెండో హీరో పోసి, హీరోయిన్ చందన, విలన్ రాజేష్, డీఓపీ రత్నం, డాన్స్ మాస్టర్ బ్రదర్ ఆనంద్, ఫైట్ మాస్టర్ దేవరాజు, సీనియర్ టెక్నీషియన్స్ పనిచేస్తున్నారని వివరించారు. మంతెన త్రినాథ్ సంగీత దర్శకత్వంలో పాటలు వచ్చాయన్నారు.

బీసీ, ఓబీసీ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడిగా విఠల్


విఠల్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎంకే ఖాబిలు జమ, నాయకులు

ఏలూరు టౌన్: బీసీ, ఓబీసీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఏలూరు జిల్లాకు చెందిన ఎస్‌పీఆర్ విఠల్ ఎన్నికవటం విశేషమని, ఆయన నాయకత్వంలో ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారనే నమ్మకం ఉందని రాష్ట్ర ఉపాధ్యక్షుడు యాండర మోహనకృష్ణ, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎండీ ఖాబిలు జమ పేర్కొన్నారు. విఠల్‌ను ఏలూరులో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈనెల 21న విజయవాడలో జరిగిన అసోసియేషన్ సమావేశంలో విఠల్‌ను అధ్యక్షుడిగా ఎన్నుకున్నట్టు చెప్పారు. విఠల్ ఏలూరులోని హౌసింగ్ శాఖలో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్నారని, దానిలో జేఏసీ వైస్ చైర్మన్‌గా, ఉమ్మడి పశ్చిమ జిల్లాకు బీసీ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడిగానూ పనిచేస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పామర్తి ఏసురాజు, నాయకులు రామసూరి, పి.రవి, ఎం.రామకృష్ణ, ఎం.నాగేంద్ర, ఎం.శేషు, ఎస్.రవిశంకర్, రాంబాబు, ఎన్.కొండయ్య, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

లారీ ఢీకొని బాలుడి మృతి


గంగుల తేజ మృతదేహం

ఆకివీడు: మండలంలోని కలవపూడి – గణపవరం (కేజీ) రోడ్డులో కోళ్లపర్రు వంతెన వద్ద మంగళవారం టిప్పర్ లారీ ఢీకొని మోటారు సైకిల్‌పై వెళుతున్న గంగుల తేజ (16) అనే బాలుడు మృతి చెందాడు. ఆకివీడు నుంచి తరటావ మోటారు సైకిల్‌పై వెళుతున్న తేజను కోళ్లపర్రు నుంచి అతి వేగంగా కేజీ రహదారి పైకి వచ్చిన టిప్పర్ ఢీకొట్టింది. దీంతో తేజ అక్కడికక్కడే మృతి చెందాడు. ఆకివీడులో పాల వ్యాపారి, తరటావ మాజీ ఉప సర్పంచ్ గంగుల వీర హనుమాన్ ప్రసాద్ కుమారుడు తేజ. ఇటీవల టెన్త్ పాసై ఇంటర్ విజయవాడలోని చైతన్యలో చేరాడు. ఈ నెల 21న కాలేజీకి వెళ్లాల్సి ఉండగా, తన నాయనమ్మ అనారోగ్యం కారణంగా కాలేజీ ప్రయాణం వాయిదా వేసుకొన్నాడు. తేజ తల్లిదండ్రులు, అక్క, బంధువులు తీవ్రంగా రోదిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు కేశిరెడ్డి మురళి, ధనరాజు తదితరులు మృతదేహాన్ని సందర్శించారు. పోస్టుమార్టం వెంటనే పూర్తి చేసేందుకు డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు కృషి చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు కాళ్ల ఎస్సై ఏజీఎస్ఎన్ మూర్తి చేపట్టారు.

నకిలీ పట్టా జారీపై ముగిసిన విచారణ

దెందులూరు: పోతునూరు గ్రామంలో నకిలీ పట్టా మంజూరుపై విచారణ ముగిసింది. పోతునూరుకు చెందిన వీరబాపూజీ నకిలీ పట్టా జారీ, వీఆర్ఓలు, ఆర్ఐ, డీటీ, తహసీల్దార్లపై లిఖితపూర్వకంగా స్పందనలో ఫిర్యాదు చేశారు. వీఆర్ఓలుగా పనిచేసిన చంద్రం, శ్రీనివాసరావు, నాగరాజులను దెందులూరు తహసీల్దార్ కార్యాలయంలో విచారణ చేశారు. ఈ మేరకు నివేదికను ఆర్‌డీఓకు అందజేశామని తహసీల్దార్ ఎన్‌వీ నాంచారయ్య తెలిపారు.

కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి రంగారావు హఠాన్మరణం


రంగారావు (ఫైల్)

పెదపాడు : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి మూల్పూరి రంగారావు (58) గుండెపోటుతో మృతి చెందారు. పెదపాడు మండలం వసంతవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పీఈటీ రంగారావు హైదరాబాదులో సోమవారం రాత్రి మృతి చెందారు. రంగారావు కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా, అసోసియేషన్‌లో అనేక పదవులు నిర్వహించారు. రంగారావుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

జాబ్ మేళాలో 37 మందికి ఉద్యోగాలు


వాసవిలో జాబ్‌మేళాకు హాజరైన విద్యార్థులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక శ్రీ వాసవి డిగ్రీ కళాశాలలో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, నేషనల్ కెరీర్ సర్వీస్ ఆధ్వర్యంలో నిర్వహించిన మినీ జాబ్ మేళాలో 37 మంది ఎంపికయ్యారు. వీరిలో టెక్ మహీంద్రాలో 31 మంది, హెటిరో డ్రగ్స్‌లో ఆరుగుర్ని ఎంపిక చేశారు. జిల్లా స్కిల్ డెవలప్మెంట్ ఆఫీసర్ ఎ.కృష్ణ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళాలో మల్టీ నేషనల్ కంపెనీలు హెటిరో డ్రగ్స్, టెక్ మహీంద్రా, లైఫ్ ఇన్సూరెన్సు కార్పొరేషన్ ఆఫ్ ఇండియా పాల్గొన్నారు. ఈ మేళాకు 118 మంది విద్యార్థులు హాజరయ్యారు. తొలుత వాసవి కళాశాల చైర్మన్ నారాయణ రమణారావు, ఏఎస్‌డీఓ ఆంజనేయులు, ప్రిన్సిపాల్ మద్దాల రామకృష్ణ, జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ మధుభూషణ్‌రావు, ఎల్ఐసీ తాడేపల్లిగూడెం బ్రాంచ్ మేనేజర్ సున్న శ్రీరామ్‌లు పాల్గొన్నారు.

వేసవి శిబిరం.. చదువుల సమయం

- కొనసాగుతున్న శిక్షణ శిబిరాలు
- ఆసక్తి చూపుతున్న విద్యార్థులు


అత్తిలి శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు పుస్తక పఠనంపై శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయులు


తాడేపల్లిగూడెం శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతుల్లో పాల్గొన్న విద్యార్థులు

అత్తిలి: వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా మంగళవారం అత్తిలిశాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు పుస్తకపఠనం, నీతికథలు చదివించారు. విద్యార్థులకు పుస్తక పఠనం వల్ల కలిగే ప్రయోజనాలను ఉపాధ్యాయులు కె కోమలి, జి రవిశంకర్ వివరించారు. పజిల్ నేర్పి, ఆంగ్లంలో మాట్లాడటం తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వి గణపతి, పి వెంకటేశ్వరరావు, ఎం శ్రీదేవి, ఎం ప్రసాద్, గ్రంథాలయాధికారి డి కృష్ణారావు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వేసవి శిక్షణ శిబిరాలు

0 గ్రంథాలయాల ఆధ్వర్యంలో ప్రభుత్వం చేపట్టిన వేసవి శిక్షణ శిబిరాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. మంగళవారం తణుకు పట్టణంలో బ్యాంక్ కాలనీలో గల పురుషుల శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు కథల పుస్తకాలు చదవడం, కథలు చెప్పించడం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. తణుకులోని మహిళా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో విద్యార్థులకు గ్రంథాలయాల ఆవశ్యకతపై వ్యాస రచన పోటీలను నిర్వహించారు. అనంతరం క్రాఫ్ట్ పేపర్‌తో బొమ్మలు తయారు చేసే విధానం, భగవద్గీత శ్లోకాలును నేర్పించడం, నీతి కథలు చెప్పించడం, కథలు చదవడం ఇంగ్లీష్ పదాలకు అర్థాలు చెప్పించడం, చెస్ బిజినెస్, అంత్యాక్షరి వంటి శిక్షణా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రచయిత్రి యర్రమిల్లి విజయలక్ష్మీ, యర్రమిల్లి ప్రభాకర్, రీసోర్సు పర్సన్ జే అలకనంద, గ్రంథాలయ అధికారి ఎస్ ప్రవీణ తదితరులు పాల్గొన్నారు. మంగళవారం తణుకు రూరల్ మండలం వేల్పూరు గ్రామంలోని జిల్లా గ్రంథాలయంలో జరిగిన వేసవి శిక్షణా శిబిరంలో విద్యార్థులకు వేసవి శిక్షణా శిబిరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఎంఈవో కోరా సత్యనారాయణ, రిటైర్డ్ ఏఈ కేఆర్ చక్రధరరావు, గ్రంథాలయ అధికారి వైవీ సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో కొనసాగుతున్న విజ్ఞాన తరగతులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని గ్రేడ్ –1శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణా విజ్ఞాన తరగతులు గ్రంథాలయాధికారి వానపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. పీజీ స్టూడెంట్‌లు ఎన్. మంగరాజు, జీవీ సత్యనారాయణలచే మంగళవారం గ్రంథాలయంలోని శిక్షణా పొందుతున్న విద్యార్థులకు లెక్కలు సులభంగా ఎలా నేర్చుకోవచ్చో చెప్పారు. విశ్రాంత ఎంఈఓ ఎస్.సాల్మన్‌రాజుచే ఇంగ్లీషు, గ్రామర్‌పై శిక్షణఇచ్చారు. మహాశివభట్టు లక్ష్మణరాజుచే తెలుగు పద్యాలు, ఎ.జనార్ధనరావుచే హిందీ, తదితర సబ్జెక్టులపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు.

ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

ఇరగవరం: మండలంలోని జగన్నన ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీవో పి.శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో మండల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీనివాస్ మాట్లాడుతూ గృహ నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో ప్రతి ఒక్కరికి ఆయుష్మాన్ భారత్ కార్డులు అందించాలన్నారు. మెడికల్ అధికారులు దానిపై అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల్లో సుస్థిర అభివృద్ధికి ప్రణాళికాలు రూపొందించాలన్నారు. పారిశుద్యం పై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. సంపద తయారీ కేంద్రాల్లో వర్మి తయారి పెంచాలని చెప్పారు. దీని వల్ల పంచాయితీలకు ఆదాయం పెరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ వై ముని రాజు, సచివాలయ కార్యదర్శులు, డిజిటల్ సిబ్బంది, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు

క్లుప్తంగా

వాసవి ఆలయంలో లక్ష్మీగణపతికి ప్రత్యేక పూజలు


లక్ష్మీగణపతికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని వాసవి కన్యకా పరమేశ్వరీ పంచాయతన క్షేత్రంలో వైశాఖ మాసం శుద్ధ చవితి సందర్భంగా మంగళవారం ఆలయంలో ఉదయం నుంచి విఘ్నేశ్వరపూజ, మహాన్యాసం, అనంతరం లక్ష్మీ గణపతి మూల విరాట్‌కు పంచామృతాలతో, ఫలరసాలతో, సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు, అలంకరణలు జరిగాయి. పేరూరి కాశయ్య, కరిసెటి శ్యామ్, ఆలపాటి కృష్ణకుమార్‌లు ఈ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

యోగాతో మానసిక ఉల్లాసం


యోగాసన పోటీలను పర్యవేక్షిస్తున్న గురువు వింజుమూరి మాధవరావు

తాడేపల్లిగూడెం (టీఓసీ): యోగా చేయడం వల్ల మానసిక ఉల్లాసం సాధ్యపడుతుందని, ప్రతి విద్యార్థి యోగాను అలవర్చుకోవాలని పతంజలి యోగాలయం యోగా గురువు ఇంజుమూరి మాధవరావు అన్నారు. సత్యసాయి ఆలయం సమీపంలో సమ్మర్‌యోగా శిక్షణా ముగింపు సందర్భంగా మంగళవారం నేర్చుకొన్న యోగా స్టూడెంట్స్‌కు తొలుత యోగాసనాల పోటీలు నిర్వహించి, అనంతరం విజేతలకు సర్టిఫికెట్స్ ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో యోగా టీచర్ కారుమూరి పార్వతి, కె.వేణు, ఎం.సుభద్ర, దత్తాత్రేయ శర్మ, శానం గోవిందు, యోగా విద్యార్థుల తల్లి దండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ధాన్యం గింజా కొనుగోలు చేస్తాం

ఇరగవరం: మండలంలోని ఇరగవరంలో ఒక రైస్ మిల్లు వద్ద నూక శాతం ఎక్కువగా ఉందని చెప్పి ధాన్యం దించుకోవడం లేదని మంగళవారం రైతులు ఆందోళన చేశారు. వెంటనే ఎస్ఐ కె చంద్ర శేఖర్ సంఘటనా స్థలానికి చేరుకొని ట్రాఫిక్ క్లియర్ చేశారు. సివిల్ సప్లై ఆర్ఐ పోతురాజు ప్రభుత్వం ప్రతి ధాన్యం గింజా కోనుగోలు చేస్తుందని రైతులకు చెప్పారు. రైస్ మిల్లర్‌తో మాట్లాడి ముందు ధాన్యం దించుకోవాలని సూచించారు. నూక శాతం ఎక్కువగా ఉంది అని మిల్లర్ చెప్పడంతో సివిల్ సప్లెస్ డీఎం తో మాట్లాడారు. రైతులుకు ఇబ్బంది లేకుండా ధాన్యం దించుకోవాలని ఏవైనా ఇబ్బందులు ఉంటే అనంతరం చూద్దామని చెప్పడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలి

తణుకు టౌన్: గ్రామాల్లో ప్రతి శుక్రవారం డ్రైడేను తప్పని సరిగా పాటించాలని తణుకు సబ్ యూనిట్ ఆఫీసర్ జీ వెంకటేశ్వరరావు చెప్పారు. మంగళవారం తణుకు రూరల్ మండలం మండపాక గ్రామంలో రేలంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించే పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో డ్రైనేజీలు, పాత టైర్లు, వాడని వస్తువుల్లో మురుగు నీరు నిల్వలేకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

గూడెంలో అభయాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు


కొత్తూరు అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద పూజలు నిర్వహిస్తున్న దంపతులు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని కొత్తూరు గ్రామంలో వేంచేసియున్న అభయాంజనేయ స్వామికి మంగళవారం లక్ష తమలపాకు పూజ నిర్వహించారు. గ్రామ సర్పంచ్ కూడవల్లి హనుమంతరావు ఆధ్వర్యంలో 108మంది దంపతులు ఈ కార్యక్రమం జరిపారు. గ్రామ సుభిక్షం కాంక్షిస్తూ ఈ పూజా కార్యక్రమం నిర్వహించినట్లు సర్పంచ్ హనుమంతరావు తెలిపారు. అనంతరం ఆలయం వద్ద అఖండ అన్నసమారాధన నిర్వహించారు. స్థానికులతో పాటు పరిసర గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ఉప్పు నరసింహమూర్తి, ఆరుగొలను మాజీ సర్పంచ్ నూకల బుల్లియ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

సంక్షేమ వారధులు వలంటీర్లు


వలంటీర్లకు పురస్కారాలు అందజేస్తున్న వైస్ ఎంపీపీ కట్టా రంగబాబు, తదితరులు

తాడేపల్లిగూడెం రూరల్: ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య సంక్షేమ వారధులు వలంటీర్లని వైస్ ఎంపీపీ కట్టా రంగబాబు అన్నారు. మంగళవారం మండలంలోని మెట్ట ఉప్పరగూడెం రైతు భరోసా కేంద్రంలో మెట్ట ఉప్పరగూడెం, కడియద్ద, నీలాద్రిపురం, కుంచనపల్లి గ్రామాలకు చెందిన వలంటీర్లకు సేవా మిత్ర పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా వైస్‌ఎంపీపీ కట్టా రంగబాబు మాట్లాడుతూ క్రమశిక్షణ, నిబద్ధతతో పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తేవాలని వలంటీర్లను కోరారు. అనంతరం 17మందికి సేవామిత్ర పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి వై.వి. వెంకట్రావు, పంచాయతీ ఇన్‌ఛార్జ్ కార్యదర్శి కె.రూపలత, కార్యదర్శులు ఆర్‌వీ.బ్రహ్మం, పవన్‌కుమార్, శేషుబాబు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో దోమలు దూరం


ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మాట్లాడుతున్న మలేరియా సబ్ యూనిట్ అధికారి లక్ష్మణరావు

తాడేపల్లిగూడెం రూరల్: పరిసరాల పరిశుభ్రతతో దోమలను దూరం చేయవచ్చని మలేరియా తాడేపల్లిగూడెం సబ్‌యూనిట్ అధికారి వైవి.లక్ష్మణరావు అన్నారు. మంగళవారం మండలంలోని వెంకట్రామన్నగూడెం, మాధవరం పీహెచ్‌సీ పరిధి మోదుగ గుంట, పుల్లాయగూడెం గ్రామాల్లో వెక్టార్‌కంట్రోల్, హైజీన్ కార్యక్రమాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో జరుగుతున్న ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో పాల్గొని కాలానుగుణంగా వచ్చే వ్యాధులపై అవగాహన కల్పించారు. వారంలో ఒక్క రోజు డ్రైడే పాటించడం ద్వారా దోమల వ్యాప్తిని అరికట్టవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారిణి శైలజ, ఆరోగ్య సహాయకులు హరనాథ్‌బాబు, కాంతారావు, భాస్కరరావు, ఎంఎల్‌హెచ్‌పీలు, సచివాలయ ఆరోగ్య కార్యదర్శి పాండురంగ, ఆశా కార్యకర్తలు, వలంటీర్లు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

6న అంబేడ్కర్ విగ్రహావిష్కరణ


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న వీరయ్య

సాక్షి, భీమవరం : పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో నూతనంగా ఏర్పాటుచేసిన 10 అడుగుల అంబేడ్కర్ కాంస్య విగ్రహాన్ని జూన్ 6వ తేదీన సాయంత్రం 4 గంటలకు శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేనురాజు చేతుల మీదుగా ఆవిష్కరించనున్నట్లు ఏపీ ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.వీరయ్య చెప్పారు. మంగళవారం స్థానిక అంబేడ్కర్ భవన్ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి, ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ సి కాసిమ్, ఎస్పీ యు.రవిప్రకాష్ తదితరులు పాల్గొంటారన్నారు. కుల, మతాలకు అతీతంగా అన్నివర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. విలేకర్ల సమావేశంలో అద్దంకి జయరాజు, పి.రాజబాబు, ఇవీ శేఖర్ బాబు, ఎస్ విజయకుమార్, ఎంవీఎస్ ప్రసాద్, కేసీహెచ్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు బైబిల్‌పై అవగాహన


గోడావారిపేట చర్చిలో చిన్నారులకు బైబిల్‌పై అవగాహన కల్పిస్తున్న సీఆర్‌డీ పీటర్

మొగల్తూరు: చిన్నారులకు బైబిల్‌పై అవగాహన కల్పించేందుకు చిల్డ్రన్ గోస్పల్ క్లబ్‌కు చెందిన జాయ్ రోడె టీమ్ సభ్యులు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నారు. మంగళవారం మొగల్తూరు పంచాయతీ గోడావారిపేటలోని క్రీస్తు లూథరన్ దేవాలయం పారిస్ 2లో చిన్నారులకు మాటలు, ఆటలు, పాటల ద్వారా బైబిల్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సండే స్కూల్‌కు చెందిన సీఆర్‌డీ పీటర్ మాట్లాడుతూ చిన్నారులకు ఈ వయస్సులోనే బైబిల్‌పై అవగాహన కల్పిస్తే మంచి నడవడికను నేర్చుకుంటారన్నారు. పీసీసీ జి.మోహన్, ఎల్‌సీసీ ఎం.రాజశేఖర్, జి.మోనిక పాల్గొన్నారు.

ఉపాధి హామీలో ఆంక్షలను సడలించాలి


రేలంగిలో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

తాడేపల్లిగూడెం రూరల్: ఉపాధి హామీ పథకంలో మహిళలపై ఆంక్షలను సడలించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కండెల్లి సోమరాజు డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని మాధవారం గ్రామంలో ఉపాధి హామీ పథకం పని ప్రాంతాన్ని ఆయన సందర్శించి, కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు కూలీలు తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై సోమరాజు స్పందిస్తూ ఉపాధి పని ప్రాంతంలో కూలీలకు మంచినీరు, నీడ, మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలన్నారు. మహిళలు కూడా పెద్ద గిన్నెల నిండా మట్టి మోయాల్సిందేనని ఆంక్షలు విధిస్తున్నారని, ఇది సరికాదని, ఈ పద్ధతి మార్చుకోవాలని హితవు పలికారు. రైతు సంఘం మండల అధ్యక్షుడు గుత్తుల నర్సయ్య, నిచ్చెనకోళ్ల రాముడు, ఎం.రామలక్ష్మి, గుత్తుల సత్యవతి, ఎస్.కుమారి పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు సంక్షేమ నిధి ఏర్పాటు చేయాలి

ఇరగవరం: ఉపాధి హామీ కూలీలకు కేరళ వామపక్ష ప్రభుత్వం తరహాలో కూలీలకు సంక్షేమ నిధి ఏర్పాటు చేయాలని వ్యవసాయా కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బళ్ల చిన వీరభద్రం అన్నారు. మంగళవారం రేలంగిలో గోదావరి అట్టల ఫ్యాక్టరీ వద్ద ఉపాధి హామీ కూలీలతో మాట్లాడారు. ఈ సందర్భంగా వీరభద్రం మాట్లాడుతూ కొంత మందికి మాత్రమే ప్రభుత్వం పనిముట్లు ఇచ్చి మిగిలిన వారికి ఇవ్వడం లేదన్నారు. దీనిని ప్రభుత్వం దృష్టిలో ఉంచుకుని అందరికి పనిముట్లు ఇవ్వాలన్నారు. ఉపాధి కూలీలకు రద్దు చేసిన సమ్మర్ అలవెన్స్‌లు తిరిగి ఇవ్వాలన్నారు. రెండు పూటల పని రెండు పూటల ఫొటో ద్వారా మస్టర్ రద్దు చేయాలని, పాత పద్ధతిలో కొలతలు ప్రకారం ఒక పూట పని విధానం కొనసాగించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఉపాధి హామీని మరింత విస్తరించి 200 రోజులు పని కల్పించి రోజు కూలీ 600 ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో గంటా సౌజన్య, చేబ్రోలు సుధా రాణి, యర్ల గడ్డ లలిత, ధర్మేంద్ర,ఉపాధి కూలీలు తదితరులు పాల్గొన్నారు.

అడవిపాలెంలో సామూహిక సాయిసత్య వ్రతాలు

యలమంచిలి: అడవిపాలెం గ్రామంలోని శ్రీ సాయివిఠల్ మందిరం 20వ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం ఆలయం వద్ద సామూహిక సాయిసత్య వ్రతాలు నిర్వహించారు. వార్షికోత్సవం ఉత్సవాలు సోమవారం మధ్యాహ్నం మూడు గంటలకు బాబా ఊరేగింపుతో ప్రారంభించారు. సాయంత్రం దూప్ హారతి ఇచ్చిన తరువాత ఆరు గంటల నుంచి మంగళవారం ఉదయం ఆరు గంటల వరకు 12 గంటలపాటు ఓంసాయి శ్రీసాయి జయ జయ సాయి అంటూ అఖండ సాయినామ సంకీర్తన కార్యక్రమం నిర్వహించారు. బాబాకు మంగళవారం ఉదయం హారతి, సుప్రభాతం, అభిషేకం చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో సామూహిక సాయిసత్య వ్రతాలు జరిగాయి. ఈ వ్రతంలో పెద్ద సంఖ్యలో మహిళ భక్తులు పాల్గొన్నారు. వ్రతం అనంతరం షిరిడి సాయిబాబాకు చందనోత్సవం నిర్వహించారు. భక్తులకు ప్రసాద వితరణతో వార్షికోత్సవ ఉత్సవాలు ముగిసాయి. సాయి సేవకులు పేరాబత్తిన సత్యనారాయణమూర్తి, సుశీల దంపతులు, పిల్లా విజయ గోపాలకృష్ణ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఫ్యామిలీ ఫిజీషియన్‌ను వినియోగించుకోవాలి

పాలకొల్లు అర్బన్: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య శిబిరాన్ని రోగ పీడితులు సద్వినియోగం చేసుకోవాలని గ్రామ సర్పంచ్ గంటా సత్యనారాయణ అన్నారు. పాలకొల్లు మండలం వాలమర్రు గ్రామ సచివాలయం వద్ద మంగళవారం ఫ్యామిలీ ఫిజీషియన్ ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో లంకలకోడేరు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అడ్డాల ప్రతాప్‌కుమార్ రోగులను పరీక్షించి వైద్య సేవలు అందించారు. దీర్ఘకాలిక రోగంతో బాధపడుతున్న రోగుల ఇంటికి వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. రిపోర్టులు పరిశీలించారు.

క్యూలైన్ స్టీల్ గ్రిల్స్ పనుల పరిశీలన


ఆలయంలో ఏర్పాటుచేసిన స్టీల్ గ్రిల్స్ పనులు పరిశీలిస్తున్న ఈవో, ఆలయ మాజీ చైర్మన్‌లు

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో క్యూలైన్ల కోసం స్టీల్ గ్రిల్స్‌ను ఏర్పాటుచేశారు. ఆలయంలో ఉత్సవాలు, కార్తీకమాసం, కార్తీక సోమవారం, దేవి శరన్నవరాత్రులు, శివరాత్రి పర్వదినాల్లో ఆలయానికి భక్తులు వేలాదిగా తరలి వస్తుంటారు. భక్తుల రద్దీ దృష్ట్యా క్యూలైన్లు ఏర్పాటుచేస్తుంటారు. ప్రతీ సంవత్సరం క్యూలైన్ల ఏర్పాటు నిమిత్తం అధిక మొత్తంలో వ్యయం అవుతుండడంతో ఆలయ అధికారులు స్టాండిడ్‌గా ఉండే విదంగా ఏర్పాట్లు చేశారు. రూ. 18 లక్షల వ్యయంతో ఈ స్టీల్ గ్రిల్స్ నిర్మాణం పనులు జరుగుతున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి యాళ్ల సూర్యనారాయణ తెలిపారు. ఆలయం మండపం నుంచి ధ్వజ స్తంభం ప్రాంగణం వరకూ ఏర్పాటుచేసిన స్టీల్ గ్రిల్స్‌ను ఎప్పటికప్పుడు తొలగించుకోవచ్చన్నారు. అలాగే ఆలయం లోపల నందీశ్వరుని నుండి స్వామి వారిని దర్శించుకునే ప్రదేశంలో మాత్రం స్టాండిడ్ గ్రిల్స్ ఏర్పాటుచేశామన్నారు. నూతనంగా ఏర్పాటుచేసిన స్టీల్స్ గ్రిల్స్ వల్ల ఆలయ ప్రాంగణం శోభాయమానంగా కనిపిస్తుందని భక్తులు హర్షం వ్యక్తంచేశారు. మాజీ చైర్మన్ కోరాడ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

దానాల్లో అన్నదానం గొప్పది


అన్నదానం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

భీమవరం(ప్రకాశం చౌక్) : అన్ని దానాల్లోకెల్లా అన్నదానం గొప్పదని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని సుంకర పద్దయ్య వీధిలోని ఆంజనేయ స్వామి మహోత్సవాల ముగింపు సందర్భంగా మంగళవారం భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరూ భక్తి భావంతో మెలగాలని సూచించారు. స్వామివారి మహోత్సవాలను ఘనంగా నిర్వహించిన నిర్వాహకులను ప్రత్యేకంగా అభినందించారు. అన్నదానం నిర్వహించడం అభినందనీయయమన్నారు. ముందుగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కామన నాగేశ్వరరావు, తోట భోగయ్య, జట్ల రాంబాబు, చిన్ని శ్రీను, గనిరెడ్డి త్రినాథ్, ముచ్చకర్ల సుబ్బారావు, గడప శ్రీను, జెట్టి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికులకు తప్పని పరుగులు

- స్టేషన్ ఆధునీకరణ చేసినా వసతుల లేమి
- అందుబాటులోకి రాని కోచ్ డిస్‌ప్లేలు
- లిఫ్టు సౌకర్యం లేక వృద్ధుల అవస్థలు


నూతనంగా ఆధునికీకరించిన తణుకు రైల్వేస్టేషన్


డిస్‌ప్లేలు ఏర్పాటు చేసినా అందుబాటులోకి రాని వైనం

తణుకు: తణుకు రైల్వే స్టేషన్‌లో రైలు వచ్చి ఆగిందంటే చాలు ప్రయాణీకులు పరుగులు పెట్టాల్సిందే.. ఏ బోగీ ఎక్కడ ఆగుతుందో తెలియక ప్రయాణీకులు నిత్యం అవస్థలు పడుతున్నారు...అయితే ఇటీవల కోచ్ ఇండికేషన్ బోర్డులు ఏర్పాటు చేసినప్పటికీ అందుబాటులోకి రాకపోవడంతో ప్రయాణీకులు నిత్యం ఉరుకులు, పరుగులు పెడుతున్నారు. మరోవైపు లిఫ్టు సౌకర్యం లేకపోవడంతో ఒకటో నెంబరు ప్లాట్‌ఫారం నుంచి రెండో ప్లాట్‌ఫారంపైకి రాకపోకలు సాగించడానికి నానా అవస్థలు పడుతున్నారు. ఇటీవల పలు ప్రజా సంఘాల నాయకులు రైల్వే అధికారులకు వినతి పత్రాలు సైతం అందజేశారు.

రూ. వందల కోట్లతో అభివృద్ధి...

భీమవరం నుంచి నిడదవోలు వరకు విద్యుదీకరణ పనులతో సహా డబ్లింగ్ నిర్మాణ పనులు చేపట్టారు. ఇందుకోసం రైల్వే శాఖ రూ. వందల కోట్లు వెచ్చించింది. అయితే నిత్యం వేలాది మంది ప్రయాణీకులను తమ గమ్యస్థానాలకు చేరవేసేందుకు నిర్మించిన తణుకు రైల్వే స్టేషన్‌లో మాత్రం అధికారులు కనీస వసతులను మర్చిపోయారు. తణుకులోని రెండు ప్లాట్ ఫారాలను విస్తరించారు. ఇందుకు నూతనంగా బ్రిడ్జి సైతం నిర్మించారు. వృద్ధులు, దివ్యాంగులు రెండో నెంబరు ప్లాట్‌ఫారంపైకి వెళ్లడానికి నానా ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయాల్లో అయితే మరిన్ని అవస్థలు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా ఎక్స్‌ప్రెస్ రైళ్లు రెండో నెంబరు ప్లాట్‌ఫారంపైకి వస్తుంటాయి. దీనికి తోడు రాత్రి సమయాల్లోనే ఎక్స్‌ప్రెస్ రైళ్లు తణుకు రైల్వే స్టేషన్‌కు వస్తుంటాయి. ఈ పరిస్థితుల్లో సుదూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణీకులతోపాటు ఇక్కడి నుంచి దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణీకులు తమ లగేజీతో పాటు మెట్లు ఎక్కి వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు.

ఏ బోగీ ఎక్కడ ఆగుతుందో...?

సుదూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణీకులు అష్టకష్టాలు పడి ప్లాట్‌ఫారంపైకి చేరుకుంటే ఏ బోగీ ఎక్కడ ఆగుతుందో తెలియక తికమక పడుతున్నారు. దాదాపు నెల రోజుల క్రితం ప్లాట్‌ఫారంపై కోచ్ ఇండికేషన్ బోర్డులు ఏర్పాటు చేసినప్పటకీ సంబంధిత కాంట్రాక్టర్ నేటికీ అందుబాటులోకి తీసుకురాలేదు. దీంతో రైలు వచ్చి ఆగిందంటే చాలు వృద్ధులు, దివ్యాంగులు, మహిళలు తమ బోగీ ఎక్కడ ఉందో తెలుసుకునేందుకు పరుగులు పెడుతుంటారు. రైల్వేస్టేషన్ ఆధునికీకరించినప్పటికీ కనీస వసతులైన కోచ్ ఇండికేషన్ బోర్డులు, లిఫ్టు సౌకర్యం అందుబాటులోకి తీసుకురావాలని ఇప్పటికే ప్రజాసంఘాల నాయకులు, వివిధ పార్టీల నాయకులు రైల్వే అధికారులకు పలు వినతి పత్రాలు అందజేశారు.

నగర పంచాయతీ సమావేశం

ఆకివీడు: ఆకివీడు నగర పంచాయతీ సర్వసభ్య సమావేశం ఈ నెల 26న మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహిస్తున్నట్లు చైర్‌పర్సన్ జామి హైమావతి తెలిపారు. పట్టణంలోని పలు సమస్యలపైన, సమీక్ష నిర్వహిస్తామన్నారు.